1940 నాటి వచన కవిత

ఏటికి ఎదురీత

పూషా (రజని)



ఏటికి ఎదురీత

ఆరు దశాబ్దాల నాటి వచన కవిత్వం

పూషా

(బాలాంత్రపు రజనీకాంతరావు)

ఏటికి ఎదురీత

ఆరు దశాబ్దాల నాటి వచన కవిత్వం

ప్రూషా

అనే కవితా నామంతో

బాలాంత్రపు రజనీకాంతరావు

1937–43 ల మధ్య సాంప్రదాయిక ప్రవాహానికి
ఎదురీతగా
రచించిన తిరుగుబాటు కవితలు

అబ్బూరి ట్రస్ట్
హైదరాబాదు

ETIKI EDURITA : Aru dasabdalanati vachana kavitvam
by **'Pusha'** [Balantrapu Rajanikanta Rao]

First published in 1999

Cover Design : Pannala Subrahmanya Bhattu

Published by : Abburi Trust
HIG, B-4, F-4
Bagh Lingampally,
Hyderabad - 500 044.

Price : Rs. 30/-

Copies available at : Visalandhra Book House,
Bank Street, Hyderabad-1.

Navodaya Book House,
Kachiguda, Hyderabad-27.

Disa Pustak Kendram
Chikkadpally, Hyderabad - 20.

Composed by : Sri Ushodaya Graphics,
Hyderabad - 44.

Printed by : Kala Jyoti Process Ltd.
RTC 'X' Roads,
Hyderabad - 500 020.

దీనిలో .....

రంజని మాటకం ?

'భాషా గురించి మాట్లాడుకుందాం !

డా. ఆవంత్స సోమసుందర్

యౌవనావిర్భావ వేళా విచలిత హృదయంలో, దరవికసిత మనస్సూన లలిత పరీమళస్ఫురణలతో – మనిషి ఎడద విచిత్రంగా ప్రకంపిస్తుంది.

ఊగిపోతుంది, క్రక్కదలిపోతుంది. ఏదో విచిత్ర హృదయావేశం ఉద్రట్లాపుతుంది. నడచి వచ్చినదారి నచ్చదు, కొత్తదారి అందదు, పాత మీద రోత కాదు గాని గౌరవం మాత్రం ఉండదు. అధునాతనత్వానికై అభీష్టం తీంద్రిస్తుంది.

కొత్త దినుసు కావాలి, ఏది కొత్తో తెలియదు. దాన్ని అందుకుందుకు చేతులు చాలవు. ప్రతి అడుగులోనూ తెలుగు అక్షరాలు మెలికలు పడుతూంటాయి. ఏదో ఉత్సేకం ప్రతి ఊరుపులోనూ గుడిసుళ్ళు త్రిప్పుతుంది. ఒక సందిగ్ధం, అడుగడుగునా, ఒక ఉద్రేకం ప్రతి ఉచ్ఛ్వాసంలోను ! ఒక వేగిరపాటు... ఒక తొందర ... ఒక దందడింపు ! గుండెల్లో పెండిలి దండాడింపు ! లో చెవిలో కిర్రెక్కించే వాయిద్యాల మ్రోత !

ఎదలో రేగే ఉద్యదుద్యమానికి ఆగికోలేక – ఏదో చేయాలన్న ఊపు ! ఏదో రాయాలన్న తోద్రోపు. ఒక వేగిరపాటు గిరగిరా త్రిప్పుతుంది. స్థిమితంగా కూర్చోనివ్వదు. అలాగని నడచిపోనివ్వదు. కాళ్ళకడ్డం పడుతుంది సంశయాత్మ.

ఇలాంటి దశ ప్రతి మనిషికీ తప్పదు, మేధావికీ, భావుకుడికీ అసలే తప్పదు! పసినాటి నుంచి ఏదో లలిత కళకు చిత్తం లగ్నమై, తత్తరపడుతున్న మనుషుల కసలే తప్పదు. ఎంత తీవ్రిస్తుందో చెప్పలేము. మనిషి అంటేనే మగ+ఆడ అనే సంపూర్ణార్థం. మనిషిపదం ఉభయలింగం. పురుషాధిక్య భావం వల్ల ప్రతి మాటనీ పుల్లింగంగా మార్చేసి సంతోసించారు మన వైయ్యాకరణులు !

సరిగ్గా అలాంటి నూతనావిర్భావ యౌవన దశావిశేషంలోనే రజని (డా॥ బాలాంత్రపు రజనీకాంతరావు) ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో తెలుగు బి.ఏ. ఆనర్సు చదువుకుంటున్నాడు. విశ్వవిద్యాలయ వాతావరణం అప్పటికింకా ఇంత భ్రష్టుపట్టలేదు. నిజంగా విశ్వకళా పరిషత్తుగానే వికసిస్తోంది.

ఆ జీవితం కొత్త; వాతావరణం కొత్త; ఎదురుగా నిలచి నిత్యం అలజడి చేసే సాగరం ! దాని సందర్శనం మరీ ఆధునాతన నయన సంకాశం ! ఎందరో నూత్న వ్యక్తులతో, వారి ప్రవర్తనలతో, వారి వారి ఆలోచనా రీతులతో సన్నిహిత పరిచయం. యౌవనపు కొత్త ఊపులందుకుంటున్న రోజులు; కొత్త మోజులూను. మనసా నిరంతర కంపమానం ! నిముషమైనా శాంతించదు, తీరిక చిక్కనివ్వదు.

సైన్సులో కొత్త ప్రయోగాలు విజయవంతమౌతున్నాయి కదా ! అలాంటి ప్రయోగశాలిత సాహిత్యంలో ఎందుకు పనికిరాదు ? ఈ రెండూ మనిషి మేథా జన్యాలే కదా''! – ఈ ప్రశ్న ఆ నాటి యువకులలో సర్వాత్మనా వ్యాపిస్తోంది. ఆపి ఆలోచింప జేస్తోంది.

ఆనాటి యెడోలెసెంట్ ఇంటలెక్చ్యువల్ – వైయ్యక్తిక పూర్వాపర జ్ఞానాను స్మృతిని పరిత్యజించి – ''నేనే ఒక నిశాంతమై, గగనమంత శ్వేత పత్రమై, సోదర జనతాముఖ స్రుత నవీన బీజాక్షరమై, సంగీత కోలాహలమై నూత్న ద్వారాలు తెరవలేనా ? కొత్త వాకిళ్ళలో ప్రవేశించి కొత్త దివ్వెలు వెలిగించలేనా ?'' అనుకుంటూ గుండెలలో సాహసోపేత ప్రశ్న పుడుతోంది, దుమికి వస్తోంది.

ప్రశ్న ఆలోచనకు మాతృక. ఆనాటి సమకాలీన భావుకులందరినీ దాదాపు అలాంటి ప్రశ్నలే వేధిస్తూండేవి. పాతకు మొగ్గి మరీ గిడసబారి బిగుసుకుపోయిన సనాతనులకు ప్రశ్న అంటేనే భయం !

ఆనాటి కవితారంగం మూడు భిన్న ప్రభావశక్తుల నడుమ ఊగిసలాడుతోంది. అటు విశ్వనాథ - ఇటు కృష్ణశాస్త్రి, వేరొక దిశగా శ్రీశ్రీ... మొదటి వారిరువురూ పరస్పర విభిన్న ప్రభావముద్రలు కలిగిస్తున్నవారే. వీరి మార్గాలకు పూర్తిగా భిన్నంగా వేరొక శక్తి శ్రీశ్రీగా పొడుచుకు వస్తోంది. మన పని వ్యాఖ్యానించడం కాదు - సమూలంగా మార్చడమే అంటూ ఆ శక్తి విజృంభిస్తోంది. స్థిరపడిన సకల మర్యాదలనూ కూలదోస్తోంది. సర్వ సరిహద్దుల్నీ చెరిపేస్తోంది. వినూత్న, మానవీయ, క్రాంతి కవితా ప్రమాణాలు సంధిస్తోంది.

అంతకు మూడేళ్ళ ముందే శిష్ట్లా ముక్తచ్ఛంద కవితారీతిలో చెప్పుకోతగ్గ కృషి ప్రారంభించాడు. శ్రీశ్రీతో పాటే శ్రీరంగం నారాయణ బాబు, పురిపండా అప్పల స్వామి ప్రభృతులు కొత్త గొంతులు విస్తరించారు. తిరుగుబాటు ధ్వనిస్తున్నారు. 1935 తర్వాత పఠాభి, పిఠాపురం యువరాజాలు ఛందోబంధాలను పటపట తెంపుతున్నారు.

మరో నాలుగేళ్ళకి హార్దికంగా యౌవన ప్రాయమందుకున్న శ్రీ రజని, సింగరాచార్య, ఏల్చూరి, సంపత్, తిలక్ ప్రభృతులు కొత్త కవితారీతికి అంకితం కానారంభించారు. వీరంతా నూత్న మానవీయ సిద్ధాంతాలనే ఆరాధించారు. సంప్రదాయ మార్గాలను దద్దరిల్ల జేసారు. అంతర్జాతీయ కవితా సంవిధానాలను అనుసరించారు.

శ్రీశ్రీ మాత్రం మరో ప్రపంచానికి కవితా మార్గం నిర్దేశించాడు. మిగిలిన వారిలో నిర్దేశాలు అంత స్పష్టంగా లేకపోయినా, తిరుగుబాటు పాటల కోరస్‌లో గొంతు కలుపుతున్నారు.

ముప్ఫయిల దశకం భారత స్వాతంత్ర్య పోరాటోద్ధృతంతో కదలిపోతున్నది. ఆర్థిక మాంద్యం ఒక ప్రక్క. నాజీ విజృంభణ వేరొక ప్రక్క. ద్వితీయ ప్రపంచ యుద్ధం కోసం రంగం సిద్ధం చేయబడుతోంది. అప్పటికే స్పెయిన్ ప్రజాతంత్ర ప్రభుత్వ

రక్షణార్థం ప్రపంచ దేశాల కవులు, మేధావులూ సమర రంగం ప్రవేశించారు. అంటే యుద్ధం, శాంతీ సర్వులకూ ప్రథమ ప్రమేయం అవుతోంది.

అట్టి గందరగోళపు జాతరలో కన్నులెత్తి పరకాయించి చూసిన ఆరంభ యౌవనుడు రజని.

తన రక్తం నిండా తన తండ్రిగారు అందించిన భావకవితా పరిమళాల మాదకత్వం ఉండనే ఉంది. నూత్న దర్శనం విరాళినందిస్తోంది, నవలోకాన్వేషణం ఆత్రం కలిగిస్తోంది. నెత్తుటి నిండా వినూతనావేశం సంసిద్ధమవుతోంది.

సరిగ్గా అలాంటి దశార్థంలో గొంతెత్తి వెనుకేకలతో పరిసరాలను ప్రకంపింప చేయాలనే ఆకాంక్ష రజనీ యువహృదయంలో సహజంగానే మొసులు వారింది. ఆ బొబ్బరింతలకు అక్షర రూపం ఇవ్వడంలో ఉన్న ఒరవళ్ళు చాలలేదు. కొత్త దారులింకా దొరకలేదు. తానే దారి చేసుకోవాలి. తానే నడవాలి.

అప్పుడీ కవి తానే ఒక నిశాంత స్ఫూర్తినని పొల్చుకున్నాడు. పూషార్క సమీప చండ కిరణాలు ప్రసరించాలనుకున్నాడు. తండ్రిగారు పెట్టిన పేరు సార్థకమైన రజనీకాంతుడే. పుత్రుల నామధేయాల్పై వంగ సంస్కృతీ ప్రభావం ద్యోతక మౌతుంది. వేంకట పార్వతీశ్వర కవులు వంగ సాహిత్యం నుంచి మేలిమి రచనలు అనువదించి తెలుగువారి అభిరుచిని పెంపు చేశారు.

తాను దర్శించి నిర్దేశించుకున్న గమ్యం తీక్ష్ణాంశు సంకలితం కదా ! అందుకే తన కలం పేరు పూషాగా మార్చుకున్నాడు. రెండక్షరాల అర్థవంతమైన పేరు. ఈ పేరు ప్రభావంతోనే నా మిత్రుడు రాంషా తన కుమారునికి ఈ పేరే పెట్టు కున్నాడు.

ఈ తరం కవుల మణమలు తొక్కుకుంటూ నడచి వస్తున్న మా తరం ఆరంభ యౌవనం నుంచీ వీరి హేలావిలాసాలను శ్రద్ధగా పరికిస్తూనే ఉంది. వీరి ప్రభావ కాంతిని హృదయాలలో దాచుకుంటూనే ఉంది.

పూషాంశువునే కలంగా సంధించి, కొత్త తెన్నులు పట్టి, ఒంటరిగా కవితా కాననాంతరాలకు ప్రయాణం సాగించాడు రజని ! ఆ కాలం అందించిన ఒత్తిడుల స్వరూపమే వేరు. అందుకున్న ఈ ప్రచండార్క తేజంతో ఒక దశాబ్దం పాటు కొత్త కవితా ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగి ఉంటే ఇప్పుడు నేనీ పీఠిక రాయవలసిన అవసరం ఉండేది కాదు. ఐదేళ్ళు చిన్నవాడినైననేను ఈ రచనకు ఆజ్ఞాపించబడటం నిజంగా అదృష్టమే.

చాలామందికి తల్లి పాలిస్తున్నప్పుడు ఒక ప్రక్కనే సమృద్ధిగా అందుతాయి. శిశువు ఆకలి తీరకపోతే రెండవ ప్రక్క కూడా వెతుకుతాడు. కాని కావలసిన పాలు అందవు. కాని కొందరు అదృష్టవంతులకు రెండు ప్రక్కలా కడుపు పట్టనన్ని పాలు లభిస్తాయి. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన రజనికి లభించిన తల్లి రెండు ప్రక్కలా పాలు చేపి కడుపు నింపింది. ఆ తల్లి ఎవరో కాదు; సరస్వతి ! కనకనే అతని రక్తం నిండా సంగీత సాహిత్యాలు పుష్కలంగా వర్ధిల్లాయి. అలాంటి అదృష్టం మరీ కొద్దిమందిదే ! ఆ తుష్టితోనే ఇప్పుడు సహస్ర శరశ్చంద్ర దర్శనానికి సమాయత్త మవుతున్నాడు రజని.

ముందు తరాల కవుల వలె ఏవో ఊహాపోహలతో తన బరువులన్నీ దేవుడి నెత్తికెత్తడం ఆనాటి యువకులు మానుకున్నారు. తమ బరువులు తామే మోస్తూ, తమ సమస్యలు తామే పరిష్కరించుకుంటున్నారు. హేతుబద్ధమూ, తర్క సహితమూ అగు అధునాతన ఆలోచనకూ అపూర్వ కవితా రీతికీ వెతుకులాడు తున్నారు. కాని, ఆ తిరుగుబాటు ప్రణాళికా బద్ధం కాదు. కనుకనే 'అనార్కీ' కూడా ఆరాధ్యమే అవుతోంది. 'అనార్కీ'ని సైతం ఆదర్శమార్గమేనని భావించారు. ('అనార్కీ'కి అరాచకత్వమనే అనువాదం సంపూర్ణ భావద్యోతకం కాదు).

తిరుగుబాటు బాటలో ఎదురయ్యే రక్కస తుప్పలు రక్కసితుప్పతలల్లా కనిపించాయి. ఛేదించడానికి వేరే ఆయుధం లేదు, కలం తప్ప ! ఆ కలానికి బోలెడు పరిమితులు. సంప్రదాయ బంధాలు. కవి మనస్సు ఆగ్రహోదగ్రమవు తోంది. అలాంటి సమయాలలోనే అరాచకత్వం వచ్చి కూచుంటుంది. పాశ్చాత్య దేశాల తాత్త్వికులు అరాచకత్వం సైతం ఒక తత్త్వంగానే భావించారు. ఒక విప్లవ మార్గంగా నిర్వచించారు.

కాలం నిలకడ లేకుండా సంచరిస్తోంది. అసంఖ్యాక ప్రభావాలు ఒకేమారు ఆలోచనా పరుని గుండెల్పై తాండవిస్తున్నాయి. అందుకే కనీసం తన పుట్టిన రోజు గురించేనా ఆశావహమైన ఆలోచనలు కలగవు. సంప్రదాయ వాదులకైతే, ఆనాడు దేవతార్చనతో ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు సాగుతాయి. ఈ ఆధునికులు తన జన్మ తల్లిదండ్రుల స్వేద బిందు ఫలితమని, విశ్వమహా సముద్రం లో పోయే వేలకొలదీ రంధ్రాలు కల నావ తనకు లభించిందనీ భావిస్తాడు. విషాద భరంగానే పుట్టిన రోజుకు పండుగచేసుకుంటానంటాడు.

తన చుట్టూ సమరాలూ, క్షామాలూ, దురంత హత్యలూ, నీరవ శోకాలూ పిక్కటిల్లుతున్నాయి. ఉన్న కాస్త భద్రతనీ హరిస్తున్నాయి. మరే విధంగా ధీమా కలుగుతుంది ? ''కరిగి ఆవిరైపంచభూతాల కలిసే గడువొచ్చేస్తోందో అని తరుగుకు పోయే ఎదరొదతో ఒక వెర్రికేక వేసేదా ?'' అనే స్వాత్మక ప్రశ్న ప్రకాశం గానే అడగక తప్పదు. ''శ్రవః ప్రేయమౌ సంగీతాలో, మనస్తర్పణమ్మౌ కవిత్వమో, మానినీ ప్రేమ మధుపానమ్మో'' - అందుకొని అలవోకగా ఆనందించే ప్రశాంత చిత్తం కరువౌతోంది ! ఆ బాహ్య పరిస్థితుల అవగాహనే అంతశ్ చైతన్యాభివృద్ధికి ప్రేరేపిస్తోంది. కనక మన ఆధునిక కవిత్వ చరిత్రలో పూషా కంఠధ్వని ఒక అనివార్యమైన ఫేజ్ (Phase).

అందుకే ఇన్నాళ్ళకి వెలువడుతున్న పూషా కవితల సంకలనం 'ఏటికి ఎదురీత'ను హార్దికంగా ఆహ్వానిస్తున్నాను.

కొప్పుడే పెద్దల మాటల్లోని విశ్వాసం చెల్లాచెదురైంది. ''ఎడదను మొలిచే చేతులు, పెదవులు నమిలే చూపులు, బ్రతుకుల సంజల గంటలు'' వంటివి అప్పటికి ఆధునికత్వంలోనే సరికొత్త పదచిత్రాలు. 'ఘనా ఘనామని పిడుగు' అనడంలో కేవల శబ్దానుకరణమే కాదు. మేఘరాసి ఉరుములతో రాల్చే పిడుగనీ తోడుతో అర్థమూ పెరుగుతుంది.

అరాచక కవిత్వం అన్నంత మాత్రంలో పదాల పోహళింపు అపస్మారకం కాదు. నిర్మాణయుతంగానే విధ్వంస గాత్రం విజృంభిస్తుంది.

మమతాను బంధాలు చెదరిపోయి మానవ సమాజం – సమూహంగా మారి పోతున్న దినాలవి. ఈ సమూహ భయంకరాకారానికి సుదూరంగా వెళ్ళిపోవాలని కవి కోరుకుంటాడు. కాని తానెక్కడికి వెళ్ళగలడు ? వేరెచ్చోట కలదని శుభ్ర నివాసం ? ''బండరాతి గుండెల'' నిశ్చేతనంగా పడి ఉన్న ఈ గుంపుతోనే సావాసం తప్పదు.

అలనాడు పూషా రచించిన కల్చర్ అండ్ ఎనార్కీ (Culture and anarchy) అనే కవితను ప్రతిభలో చదువుకుని మిత్రులంతా సమిష్టిగా చర్చించుకున్నాం. అంతుపట్టినంతా ఆకళించుకున్నాం. ఆ అనుభవాలను మర్చిపోలేం. మా తరంలోని కొత్త కవితా రసికులు ఇంకా ఎందరు మిగిలి ఉన్నారో తెలియదు. కాని అప్పటికే మాకు అగ్రేసరులైన పూషా ప్రభృతుల కవితల స్మృతి తరంగాలు ఇప్పటికీ తాజాగా మోజు కలిగిస్తూనే ఉన్నాయి. ఆ కవితలకు అప్పట్లో గొప్ప కీర్తి లభించినదనడంలో సంశయం లేదు.

సకల సంప్రదాయ బంధాలూ, భవబంధాలూ త్రెంచుకొన్న మనస్థితిలో – ఈ కల్చర్ అండ్ ఎనార్కీ వంటి క్రోకార్కరు కవితలు మాలో మౌనవిప్లవాన్ని సంఘటితం చేశాయి. అనేక ఇజాలు యూరప్ నుంచి ధారాపాతంగా వచ్చి పడుతున్న రోజులవి. నాజీజం, ఫాసిజం వంటి అమానుష వాదాలు, న్యూడిజం వంటి వెకిలి వాదాలూ సైతం వ్యక్తినీ, సమాజాన్నీ భయపెట్టక మానడం లేదు. గోబెల్స్, గోరింగుల వంటి నాజీ రక్కసుల పేర్లు ప్రతీ ఇంటా వినిపిస్తున్నాయి. తెల్లవారితే ఏ విపత్తు వీధి వాకిలి తడుతుందో తెలియదు. అలాంటి అసంబద్ధ స్థితిలోంచి వచ్చే ఆలోచనల్లో చేతికి దొరికిన ప్రతి భాషనీ కవి ప్రయోగించక తప్పదు, థింకర్ శ్రీ లింగం థింకరీని స్పృంజించడం కేవలం చమత్కారానికే కాదు.

దినవారీ ఆలోచనల బరువులు దించుకుందుకు నిర్జన వాటికలకు వాహ్యాళిగా పోయినా అవే ఒత్తిడులు. అవే నత్తి మాటలు. ప్రతీ నగరంలోనూ మిలట్రీ మార్చి, విశాఖలో జపాన్‌వాడు బాంబులు వేసిన భీతావహం. మేధస్సులు పొగ చూరు తున్నాయి. నేలమీంచి లేచినపొగలు మైకి అలముకుంటూ దడిపిస్తున్నాయి. అలాంటి శూన్య స్థితిలో ప్రతీ వాడిదీ "నీ (నిర్ + రూప = నీరూప) రూప భయంకరాగ్రస్యమే, నీరవ, కఠోర తమ హాస్యం ఎదురౌతుంది. ఇది ఛాయాంధాంధ కారలాస్యమే. బీభత్స ప్రళయ నైరాశ్యం, నిరంతర యుధ్యత్ బుద్ధి నిరుద్ధం. శుద్ధ పరిణద్ధాన విద్ధా ప్రబుద్ధ బుద్ధి విముగ్ధం." ఇట్టి దుష్ట పరిస్థితిని సాంద్ర తరంగా వ్యక్తం చేసే ఈ సంస్కృ తపద బంధాలన్నీ భాషా పటాటోపం కోసం కాదు. స్పష్టతర అర్థోత్పత్తి కోసమే. ప్రతివాడి గుండెల్లోనూ – గ్లాని, ఆమం – తీవ్రతర మౌతున్న రోజులు. ఆ నిజస్వరూపాన్ని ఈ సమాసాలు కర్కశధ్వనితో వ్యక్తం చేస్తున్నాయి.

"Forget every yesterday!" అనేది అనార్కిస్టుల మోటో. చావులు తండోపతండాలుగా జనానీకాన్ని ఆక్రమిస్తున్న రోజుల్లో సమాధుల నిర్మాణమూ

సామాజిక కార్యక్రమమే. ఇది ఉద్యత్ హోమానలం. సహేంద్ర తక్షకాయ స్వాహా అంటూ సర్వాన్నీ యజ్ఞాగ్నికి ఆహుతి చేస్తున్న కాలం.

''జాతులు భాషలు దేశాలు
ఖండాలు సముద్రాలు గోళాలు
అరాజకంలో ఎనార్కీలో
విప్లవ విలయ ప్రళయ జ్వాలల్లో
భగ్నం, భుగ్నం, మగ్నం, నగ్నం కావాలి !''

అనుకుంటుంది అనార్కీతత్త్వం, డార్విన్ ప్రవచించిన జీవ శాస్త్రంలోని 'సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్' (Survival of the fittest) కు విపరీతార్థం ఘటింపబడుతుంది.

'మధ్యాహ్నం' అనే సత్కవిత ప్రచురితమైన తొలి తేదీ నాకు జ్ఞాపకం లేదు. బహుశా విశాఖపై బాంబులు పడిన సందర్భంలో రచించినదేమో ! ''చేరేసి తొందరలోన ఊరేగే చీమల బారు'' వలె నగరవాసులు కాందిసీకులై భయానకంగా సురక్షిత ప్రదేశాలకు పారిపోవాలని ఆరాటపడుతూండడం ద్యోతకమౌతుంది, ''మున్సిపాలిటీ సైరను మూర్చారావంలా వినిపించి'' ప్రతి మనిషి చేష్టలనూ స్తంభీ భూతం చేస్తున్నది. సర్వవ్యాపిగా మృత్యుహేల. భీతి నుంచి తప్పించుకునే చోటు లేదు. అదీ ఎండిన మొండి మధ్యాహ్నపు భయంకరాకృతి.

దేవుణ్ణి మనిషే చేశాడో, మనిషిని దేవుడే చేశాడో తెలియదు. పూర్వగాథల మొండి నమ్మకాలన్నీ వమ్మైపోయాయి, వర్తమాన మానవుడు మాత్రం సైతాన్ ప్రతిబింబమే. అన్ని విలువలూ కోల్పోయాడు. మనిషి గుండెకు సైతం ఖరీదే మిగిలింది. విలువలు నిలవబారి చలికంపు కొడుతున్నాయి, 'సర్వం, దుఃఖం ఖల్విదం జగత్' వంటి ఆదిశంకరుల సూక్తులన్నీ వెక్కిరింతలుగా మారాయి. కుశంకల, త్రిశంకు నరకం

ప్రపంచమంతటా తెరుచుకుంది. ఉన్నది పోవాలి సరే, ఏది రావాలో తెలియదు !

1780 నాటి ఫ్రెంచి విప్లవాన్ని పూషా స్మరిస్తాడు. ''కడుపుల్లో కాళ్ళు, కళ్లల్లో నీళ్ళు'' పచ్చని గరికైనా కనిపించని ఎండిన బయళ్ళు, అందరికీ శ్మశానమే వాస యోగ్యమైన వైపరీత్యం. ఆ దినాల కలపోతలను ఈ గీతం ప్రతిబింబించింది.

ఏది క్షణికమో, ఏది శాశ్వతమో ఎవరికీ తెలియదు. క్షణికంలోనే శాశ్వతత్వం ఉందా ? శాశ్వతత్వం ఐనదంతా క్షణికమేనా ? అంతా నిశాసందిగ్ధమే. ఐన్‌స్టీన్ ప్రవచించినట్లు అన్నీ సాపేక్షాలే. దేనికీ ప్రత్యేక ఐడెంటిటీ లేదు. ఈ కవిత గొప్ప కవితామయంగా సాగింది. ప్రతిపాదమూ ఆలోచనాభరంగా గజగమనం చేస్తుంది. కవి ప్రతిభ భావుకత్వంలో ప్రతిబింబిస్తే వ్యుత్పన్నత అక్షరాక్షరంలో ఉద్వ్యక్త మయింది.

''సింగార, బంగారాల్కై చిరతపులుల చెలగాటాలు'' వంటి పద చిత్రాలు శబ్దార్థాలను, భావార్థాలను ద్విగుణీకృతం చేస్తాయి. ''శంఖావర్తపు చంక్రమణం లో శాశ్వతంగా పరిభ్రమించే కాలయవనిక'' అనేది ఎంతో సార్థక భావస్ఫోరకం, చివరికి భావం శాశ్వతం, భాష్యం క్షణికం – వంటి నిర్ణయాలకొస్తాడు. భారతీయ ఆలోచనాలహరి ప్రతి పాదాంతర్గతికంగా భాసిస్తుంది.

డెలీరియం అనే కవిత ఆకర్షణీయమైన పదచిత్రాలతో సంశయాస్పద జీవితాన్ని చిత్రిస్తుంది. ''టిక్కెట్టు పారేసుకున్న ప్రయాణికుడి హృదయ గందరగోళం''. పౌరు లందరికీ కింకర్తవ్యతా విమూఢత్వాన్ని ద్యోతకం చేస్తుంది.

మహాగాయకులు. కె.సి.డే., ఉమాశశి, న్యూ థియేటర్స్ ద్వారా మహత్తర కళాఖండాలందించిన యాక్టర్–డైరెక్టర్ బారువా వంటి కొద్దిమందే ఈ డెలీరియం నుంచి రక్షించి జీవన ప్రశాంతి కలిగించారు. ఉత్తమ వ్యక్తులు లేకపోతే సర్వం జడాజర్జరితమే. అదే ఈ కవితలోని రహస్యం.

చరమకాంక్ష అనే కవిత రసహృదయ లాలసం. ''ఓ చరమ కాంక్షా! నాకు పరమ సౌభాగ్యవతి వతికి ఈ దౌర్భాగ్యమెందుకు ?'' అన్న ప్రశ్న ఆనాడు పూషా ప్రతిపాదిస్తే – ఈ నాటి రజని ''ఆశా, నా ప్రాణసఖి ! దగ్గరగా రా ఇంకా దగ్గరగా రా'' అంటూ అమితానంద పారవశ్యం కలిగించే గీతిని పాడుతున్నాడు.

అనుకోని ఆఖరి అతిథి – ఒక అద్భుత కావ్యం. కవితారసజ్ఞులు అక్షర చక్షు సంయోగంలో అనుభవించగలరు. పురా భారతీయమేధ అందించిన సకల తాత్త్విక సార సమాహారం నిస్సందేహంగా ఈ కావ్యం గర్భీకరించుకుంది.

''అవును గాని రజనీ, గోరాశాస్త్రితో కలిసి రచించిన మృత్యువు అనే గొప్ప కవిత ఏమైపోయింది ? అది మీ ఇరువురి పేర్లతో తెలుగు స్వతంత్రలోనే నా ప్రచురితమయ్యింది?''

ఈ ఏటికి ఎదురీతలోని అధిక కవితలు దాదాపు షష్టిపూర్తి చేసుకుంటున్నాయి. అయినా వాటికి ముదిమి కనిపించదు. తళతళ మెరుస్తున్నాయి. అలనాడు ఆరంభమైన ఆధునిక వివేచన పెరిగి ఆధునికోత్తర స్థితికి చేరుతున్నా ఈ కవితలెప్పటికీ నవంనవంగానే ఉన్నాయి.

నా ఆరంభ యౌవనపు సాహిత్యోద్వేగాలతో ఈ కవితలను అధ్యయనం చేసిన అనుభవాలను ఇన్నాళ్ళకు తిరగతోడుకోవడం సాధ్యమయింది. అందుకే ఆనందంతో అందర్నీ అభినందిస్తున్నాను. అలనాటి పూషా కవితలకు మనసారా స్వాగతం చెబుతున్నాను.

★ ★ ★

తొలి పలుకులు

నేను (రజని) 1937–40 ల మధ్య ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి. ఏ. ఆనర్సు మూడేళ్ల (ఎమ్. ఏ.) కోర్సు చదవడానికి వెళ్లి వాల్తేరులో విశ్వవిద్యాలయ హాస్టల్లో ఉండేవాణ్ణి.

అప్పుడు – 'ఆసుపత్రి కోకిల'గా విశాఖలోని కె. జి. హాస్పిటల్‌లో టి.బి. వ్యాధి చికిత్సకై ఉంటూండిన జరుక్శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) తనకి వీలైనప్పుడల్లా వాల్తేరు వచ్చి, ఊళ్ళో అబ్బూరి వారింటికి వెళ్ళి, మాస్టార్నీ, వరదనీ, హాస్టల్‌కి వచ్చి నన్నూ కలిసి పోతూండేవాడు. వచ్చినప్పుడల్లా కాలక్షేపం ఏంటంటే శ్రీశ్రీ మహాప్రస్థానం, పఠాబి ఫిడేలు రాగాల డజనూ తన (జరుక్కవి) రచనలూ వినిపిస్తూ ఉండేవాడు. వాటివల్ల ప్రభావితుణ్ణైనప్పటికీ, అతను మరొకసారి మా హాస్టలికి వచ్చేసరికి వినిపించడానికి ఆధునిక భావాలతో, ఏటికి ఎదురీతగా కనిపించే కవితలు రాయాలనీ 'పూషా' అనే కవితా నామంతో కొన్ని కొత్త కవితలు వినిపించేవాణ్ణి.

ఈ రచనలు, అప్పటికప్పుడే నేను గానయుక్తంగా ప్రారంభించిన మధుపాయి, మాధురులు, చండీదాసు వంటి గేయాలకంటే రచనలో భిన్నంగా రాగంలేని మద్దెల వాద్యంలాగా వినిపించే నవ రచనారీతులవి.

రచన చేసిన వాటిలో ఏ అయిదారో దొరకక పోయి ఉంటాయి. ఉదాహరణకి ఒక దొరకని కవితలోని మాటలివీ:

చలం ప్రేమిటివా కలం వామిటివ్వా
శ్రీశ్రీ చవటా రుక్మిస్త్రి 'వటా' పఠాభి తాధా అంటావా'
దిగవోయి బ్రదర్ దిగవు పెడెస్టల్ దిగవా యిదిగో పిస్టల్!

క్రేడిల్ నుంచి కాఫిన్ దాకా వదలని వాసనలకీ యాసలకీ

ఎందుకు రోత – మూత !

దిగవోయి బ్రదర్, దిగవు పెడెస్టల్, దిగవా యిదిగో పిస్టల్

దీని పూర్తి పాఠం ఇప్పుడు దొరకటం లేదు. వీటిని ఆనంద వాణిలోనో తెలుగు స్వతంత్రలోనో 42 వరకూను, ఆ తరువాత ఏభైలలోనో ప్రచురించారను కుంటాను.

ఆ తర్వాత రేడియోలో చేరిన తర్వాత నా గేయకవితా వ్యామోహం రాగాన్ని చంపే, కేవలం మృదంగ జతుల మోహరింపులలో సాహిత్య భావాలనే ప్రకటించే ఈ తిరుగుబాటు కవిత్వ ధోరణిని క్రమంగా హరించుకు పోయేటట్లు చేసింది.

ఈ 'పూషా' రచనలు – రేడియో సంగీత రచనల నడుమ క్రమంగా ఏష్యం అయిపోయాయి. మితిమీరిన అహంకారంతో 'షా'ని – 'Pooh' - 'Pooh' చేస్తే మరేమవుతుంది ?

ఆ మధ్య కుందుర్తి, మరి మరణించే ముందు ఆరుద్రా వీటిని గురించి ఆపేక్షగా గుర్తు చేసేవారు. రాసినవి కొద్దిపాటి అయినా ఎందుకో అబిమానంతో కాటూరి వారు తమ విమర్శన వ్యాసాలలోనూ, కురుగంటి, పిల్లలమర్రి హనుమంతరావు గారలు తమ నవ్యాంధ్ర సాహిత్య వీథులలోనూ ప్రస్తావించారు.

మీ 'పూషా' రచనలు ప్రచురిద్దాం – సేకరించి ఇవ్వండీ అని అడిగిన అబ్బూరి ఛాయాదేవిగారి ప్రోత్సాహానికి కృతజ్ఞతా పూర్వక వందనాలు. కొద్దిపాటిగా అయినా, 'పూషా' రచనల్ని పైకి తేర్చి నా ఎనభయ్యో యేట అర్వైయేళ్ళ క్రితపు రచనలు ప్రకటించే అవకాశం వచ్చినందుకు సంతోషిస్తున్నాను.

రజని (పూషా)

విజయవాడ – 10

మే, 1999

పుట్టినరోజు

జననీ జనకుల శ్రమ ఫలితమ్మో
స్వేదవారి బిందువు నా దేహం
పెరిగి పెద్ద దౌతోందని సంతో
షంతో గెంతులు వేసేదా ? –
కరిగి ఆవిరై పంచభూతాల
కలిసేగడు వొచ్చేస్తోందో అని
తరుగుకు పోయే యెదరొదతో వొక
వెర్రికేక నే వేసేదా ?–
దేవుడనీ దేవుడి వరాలనీ
ప్రణయమనీ, స్వర్గమనీ ఆశల
పల్లకీలలో వూరేగింపుల
పుట్టినరోజని పండగ చేస్తా
విశ్వమహాసముద్రాన పోయే
వేలకొలది రంధ్రాల నావ యిది
విహరించాలంటే వేలకొలది
వూత కోలలో దాపుకొయ్యలో
నేత్ర పర్వమౌ చిత్ర శిల్పాలో

శ్రవః పేయమౌ సంగీతాలో
మనస్తర్పణమ్మౌ కవిత్వమో
మానినీ ప్రేమమధుపానమ్మో
మరపు ముసుగు తెరలో మాటుపడని
పుట్టిన్ రోజో పండగో – చేస్తా !
అగాధ హృదయంలో కథలకు నా
ప్రగాఢ మైత్రి కలశ్రుతులో, నా
ప్రణయినీ మణుల భద్ర సంస్మృతులో
జత చేసుక, ఏవెతలూ కలగని
సౌఖ్యజీవితమ్మె అనుభవిస్తా
ఎన్నో సారులు ఈ విధంగానె
పుట్టిన్ రోజుకు పండుగ చేస్తా !
పోయేరోజుకి వాయ్దావేస్తా !

అందవు అందవు

అందవు అందవు యెంత చాచినా
యెడదల మొలిచే చేతులు
ముందుకు ముందుకె, యెంత చూచినా
బరువుగ మెరసే చూపులూ !
తడియవు తడియవు యెంత కురిసినా
వలపుజడుల బడి యెడదలు !
తనియవు తనియవు యెంత విరిసినా
వెన్నెల సుడులలో కన్నులు !
అందవు అందవు యెంత సాచ్చినా
యెడదల దొలిచే చేతులు
ముందుకు ముందుకె యెంత విచ్చినా
పెదవుల నమిలే చూపులు !
తెలియవు తెలియవు యెంత మ్రోసినా
బ్రతుకుల సంజల గంటలూ
కలియవు కలియవు యెంత సొలసినా
ఒకటై రెండు యెడందలు !!

ముందు (కథా పద్యం)

ముందు; నాలుగు మబ్బులు గోడల సందు;
ఉన్నారా వారిందు
కరుణా వరుణా, అరుణా చపలా, కావేరీ శేఫాలీ –
పాలిన తారలు – సోలించే పెర్ఫ్యూం సువాసన డోలీ –
మనసులో మునక, వెనుకకో అడుగు –
ఘనా ఘనా మని పిడుగు ! –
వాకటి అందం వేకటి చందం మూక ముసురుకుని వడిగా
నీరసమైన పలాచని మెరుపు !
'ఎవరండీ' అని పిలుపు
తన గుండెల్లో ఎక్స్‌ప్రెషన్ కోసం
దడా దడామని తలుపు !
ఎక్స్‌క్యూజ్‌మి, ఐకం, గ్రంం సో – సో –
సోసో మీకొక వలపు –
ఇప్పుడు వల్ల కాదండీ మనసంతా తిడతారండీ
– తలుపు !
మబ్బు "కటకటాలూ" "పంజరం"లో మలిన రజని యిక్కట్లు !
అబ్బ లేదు మసెంజెర్‌కి లోపల అడుగడుగా టిక్కెట్టు !! ✤

ఎరగని మొగాలు

నా చుట్టూరా యెందుకు నీళ్ళు
యెరగని మొగాల పరాయి వాళ్ళు !
వాళ్ళ గుంపులో యెందుకో నేను
యెరగని మొగంతో పరాయిగాను !
        నా బొందో అని దగ్గిరికొస్తే
        నామాలకాకి అని తోసేస్తే
        నా చుట్టూరా యెందుకు వీళ్ళు ?
నా రక్తాన్నే పీల్చేస్తారు,
నా మాంసాన్నే దొల్చేస్తారు, దోచేస్తారు !
నా యెముకల గూడే కంచం వీళ్ళకి ! మంచం వీళ్ళకి !
నా హృదయం తల్పం వీళ్ళకి
నా చుట్టూరా యెందుకు వీళ్ళు !
        గుండె విప్పి పనసపండులా
        గుమ గుమ లాడించినా కూడా
మొండి ఘటాలోయ్ తనియరు కలగరు !
బండరాతులోయ్ ! కలియరు : కరగరు ! కదలరు !
తేనె చుక్క పూసినా కూడాపైపెచ్చు ముళ్ళే తగుల్తాయ్ !
ప్రాణాల్ తీసే విషమంటారోయ్ !

నా చుట్టూరా యెందుకు వీళ్ళు ?
జాలీ, విశ్వాసం, ప్రేమా, అభిమానం, వాడిన మొగాన
కత్తి కోతలో నెత్తురులా శూన్యం !
ఇంతకంటె ఒంటరి బతుకో లేకపోతే తుంటరి బతుకో
ముమ్మాటికి ధన్యం !
నేనంటే జాలి లేని వాళ్ళు
నన్నర్థం చేసుకోని వాళ్ళు
వాళ్ళ గుంపులో యెందుకో నేను
యెరగని మొగంతో పరాయిగాను !

కల్చర్

అంతులేని బ్రహ్మాండ భాండాని కడుగున పైనా ఒక కప్పు !
అను పల్లవి సాగడానికొక fag, hot hot కాఫీ అరకప్పు
అది ప్రాచీనుల తప్పో ఐన్‌స్టీన్ గప్పో, వెల్స్ గాసిప్పో ఒప్పో
బ్రహ్మాండ భాండ గర్భం నవమాసాల్‌పేగు పేగునా కల్చర్ !
వికసితమానవ మస్తిష్కానికి అమోఘమౌ వొకటింక్చర్
అది మానవ శుష్క కళేబరం పాలిటి వొక్క మహాపెనువల్చర్ !
వొక్కొక్కడికీ యెవడికివాడికీ
నాలుగ్గోడల నడిం ప్రపంచం ! కల్చర్ – కంచం మంచం !
యెవడికి వాడికి – యెవడిదివాడిది !
మా యింట్లో నేనొక Pooh Shaw ని షర్వాని, నాదర్వాని !
నీ యింట్లో నువ్వొక go wells వి గోబెల్స్‌వి, గోరింగ్ టాంగ్‌వి !
సెంటిమెంటలిజమూ, కాంటినెంటలిజమూ, న్యూడిజమూ
ఇజములు ఎన్నో పెసిమిజమూ, స్యాడిజమూ
'గ్రీన్' 'కన్' 'ఛ్యార్స్' థింకర్సు లైబ్రరీ
వాడికి టుబియే థింకర్ లగ్‌షరీ
నువ్వు థింకరూ, నేను థింకరు, ఆయన థింకర్, ఆమె థింకరి !

అరకప్ కాఫీ సిగరెట్ ప్యాక్,
పార్కో బీచో స్మశానమో
అరకో సున్నరమైలు షికార్
అనువు బట్టి కాల్నో, జట్కా పైనో, కార్లోనో !
ఈ ఫిల్మ్ డైరక్టర్ ప్రజ్ఞా, ఆ వెల్నోన్ ఆర్టిస్టు ప్రతిభా
ఈ కంట్రీ కాన్స్టిట్యూషన్, ఆ నేషన్ రివల్యూషన్
ఈ పెర్సన్ పబ్లిక్ స్టేటస్, ఆ లేడీ సోషల్ స్కేండల్స్
ఘోషణ దూషణ, సంభాషణ ఇంటలెక్చువల్ డిస్కోర్సస్
ఎబ్రిమేన్స్ థింకర్స్ కల్చర్
కళ్ళు మూసి చూడెన్నో రయిళ్ళు, మేళ్ళు, వెన్నెల గోడలు
వొళ్ళు మరిచినా చెరిగిపోలేని విజ్ఞాన ప్సెనుబైళ్ళు
వెలుతురు, వెలుతురు మహోర్తనాదం చేస్తూ వెలుతురుడోళ్ళు
లెఫ్ట్, రైట్ హెవ్ హెవ్ నిధ్వానమ్ముల మార్చి చేసే జనరళ్ళు
కళ్ళు తెరిచినా చెదిరిపోలేని అంధచ్ఛాయల కాళ్ళు !
వొళ్ళు మరిచినా చెవిహొదల్లేని రోదనరవాల ముళ్ళు !
దీన్ని యేజ్ ఆఫ్ కల్చర్ అంటాం !
దొరకని దాన్నీ దొరికిన దాన్నీ కొరుక్కుంటాం !
వొకర్నొకరం మహా కసిగా పసిగా నరుక్కుతింటాం !
పులిసిన కళేబరాలూ కుళ్లిన హృదయాలూ పాతేస్తాం !
పొగ చూరిన నిడుపాటి మేధస్సుల్తో పయీకిలేస్తాం !

ఇది నీ రూప భయంకరాస్యం ! ఇది నీరవ కఠోరతమ హాస్యం !
ఇది ఛాయాంధాంధ కారలాస్యం ! ఇది బీభత్స ప్రళయనైరాశ్యం
అనిదమిద్ధం ! నిరంతర యుధ్యత్ బుద్ధి నిరుద్ధం
శుద్ధ పరిణద్ధాన విధా ప్రబుద్ధ బుద్ధి విముగ్ధం ✤

1943 ప్రతిభ – నవ్య సాహిత్య పరిషత్పత్రికలో 'కల్చర్ అండ్ ఏనార్కీ' అచ్చయినాయి.

అండ్

'అండ్' ఈక్వల్స్‌టు 'మరి'
దేర్‌ఫోర్ టూవర్డ్స్ – సరి
అక్కర్లేదు, అన్‌నెసిసరి !
ఓల్డ్ గ్రాండ్ మమాకి కొకెట్రీ
గ్రేట్ గ్రాండ్ పపాకి గెలాంట్రీ
స్పెన్సర్ భోక్తలకి చౌట్రీ !
బేడ్ లివర్‌కి పౌల్ట్రీ
కడుపుల మంటల్లో పేజంట్రీ
దరిద్రవీథికి 'వెల్ఫ్రీ'
చావపూరింటికి టేపెస్ట్రీ
అశాశ్వత నరుడికి కెమిస్ట్రీ !
టెంపెస్ట్‌లో బేనియన్ – ట్రీ,
మనిషికి లవ్, ఆఫ్ మదర్ కంట్రీ
జీవితానికి ఆర్ట్ అండ్ పోయ్‌ట్రీ
అక్కర్లేదు అన్‌నెసిసరి !
యూనివర్స్‌కింక పెడాంట్రీ
అక్కర్లేదు, అన్‌నెసిసరి !
ఫర్‌గెట్ ఎవ్రీ యస్టర్ డే !
డోంట్ థిన్క్ ఆఫ్ 'వెన్ దిలాస్ట్ మినిట్' ✤

ఏనార్కీ

మేం సమాధి నిర్మాతలం !
వెస్ట్ మినిస్టర్ ఆబే, తాజ్మహలూ
పిరమిడ్లూ, సమాధులనేకం !
అవి మానవ వ్యక్తుల సమాధులు !
మా నిర్మితి సంఘం సమాధి !
మహాకాల చక్రము నంటుక
పరిభ్రమణ చేసే శక్తులు
పరిక్లమన పొందిన నరులని
పరిప్లవన చేయిస్తుంటే
వాహినిలో నలుసును నేనూ
పరిక్రమిస్తొ వడిగాను !
ఇది ఉద్యత్ హోమానలం !
సహేంద్ర తక్షకాయ స్వాహా !
ప్రాచీనతలన్నీ కరడై
వయస్సుతో వరడై బెరడై
వదలకున్న వాసనలన్నీ
సహేంద్ర తక్షకాయ స్వాహా !

వాగనీ మ్రోగనీ చెలరేగనీ !
విప్లవ శంఖం విలయ శంఖం
కాలచక్రం మధ్యేమార్గాన
తప్పతున్నాం అఖండ సమాధిని
వైవిధ్యాలూ వైరుధ్యాలూ
వైతథ్యాలూ వైధవ్యాలూ
వృద్ధ వృద్ధ వృద్ధ వృద్ధతలూ
ప్రాచీన 'చీన' చీనతలూ
రూపం దాల్చిన బృహద్గజానికి
కాల చక్రం మధ్యేమార్గాన
తప్పతున్నాం అఖండ సమాధిని !
జాతులు భాషలు దేశాలు
ఖండాలు సముద్రాలు గోళాలు
అరాజకంలో ఏనార్కీలో
విప్లవ విలయ ప్రళయ జ్వాలలో
భగ్నం భుగ్నం మగ్నం నగ్నం కావాలి !
వర్షానంతర ప్రశాంత శారద నభానికి
దేశ ఈజ్ ఓన్లీ వన్ ఫిట్ టెస్ట్ ?
సర్వైవల్ ఆఫ్ ది ఫిట్టెస్ట్ !

మధ్యాహ్నం

ఇది యెండిన మొండి మధ్యాహ్నం
మది యెండిన బండ మధ్యాహ్నం
హృది మండిన యెండు మధ్యాహ్నం
మిట్ట మధ్యాహ్నపు తెలతెల తెల్లగ
ఆడే ఆకుల నీడల నడుమని, కొబ్బరి ఆకుల కెడం ఎడంగా
కదిలే ఎండండ పొడలు !
పళ్ళెంలో బియ్యపు ముక్కనో కళ్ళంలో చిమ్మట తుక్కునో
చేరేసే తొందరలోన
ఊరేగే చీమల బారు !
వీథి వాకిట బిచ్చపు మనిషి
ప్రాణం విసిగెత్తించే వేపే కొరుక్కుతినే కేక !
మునిసిపాలిటీ సైరన్ మూర్ఛారావం !
విరామ మెరుగక వీథిగోడపై
వెర్రివాడి వుపన్యాస ఫక్కి
విసుగులేని ఫ్లేక్టరి ధోరణిలో
కుంటికాకి చావుకూత ! చెవికి రోత ! కడుపు కోత !
భూగర్భంలో పిత్రుదేవతల గుసగుసల్లాగ

గుండెల్లో బెంగల గురగురల్లాగ
కిటికీ పంచని బాకీ వాడి రుసరుసల్లాగ
కుళాయి దగ్గర వోల్డ్ లాండ్లేడీ సణుగుల్లాగ సాధింపులాగ,
ప్రపంచమంతా
మహాప్రపంచపు సిటీ హడావిడి అంతా
స్మృతి విస్మృతి సంధ్యల్లో మస్కై
మసియై విసవిసలై కసికసిగా
నా గది పక్కని నాగదిలోనే
నా మదిలోనే   నా హృదిపైనే
నా కలలోనే   నా తలపైనే
నాట్యం చిందుల శివలయ నాట్యం !
ఇది రోల్స్‌రాయ్స్‌లో షికారు పోయే సాయంత్రం ఎంతమాత్రం కాదు
బిచ్చగాళ్ళు ముష్టికి పోయే
శుభోదయం అంతకంటే కాదు
ఇది యెండిన మొండి మధ్యాహ్నం
మది యెండిన బండ మధ్యాహ్నం
హృదిమండిన యెండు మధ్యాహ్నం !

త్రిశంకు నరకం

ఎందరెందరో స్వర్గం స్వర్గం
స్వర్గం అన్నారు ?
పుర్రెకొక బుద్ధి ! జిహ్వ కొక రుచి
మనిషి మనిషికీ తలవొక స్వర్గం !
పెద్దలో మొద్దులో అన్నారు
దేవుని ప్రతిబింబం మానవుడని
మొన్నటి థింకర్ ఒకడన్నాడు !
అదీ యిదీ కూడా కాదంటా
సైతాన్ ప్రతిబింబం మానవుడో
మానవ ప్రతిబింబమె సైతానో
అంటా ! – కాదనేదెవరంటా !
శంకరుడొకడూ, గౌతముడొకడూ
ముండిత మస్తకులై అన్నారు;
లోకం శోకమయం సమస్తం
సర్వం దుఃఖం ఖల్విదం జగత్ !
ముందో – వెనకో తెలియని యిటు
నరకం లేదన గుండెలే లేదు !

ముందు, వెనకా పైనా కిందా
అంతా నరకం చింతా నరకం !
కుశంక నరకం ! త్రిశంకు నరకం
కావాలిప్పుడు త్రిశంకు నరకం
రావాలిప్పుడు త్రిశంకు నరకం
ఘనీభవించిన నారకతమస్సు
గభీర గర్భం నవనవ కాంతులు
ప్రజ్వరిల్లగా రావాలిప్పుడు
రావాలిప్పుడు త్రిశంకు నరకం
పదిహేడు వందల యెనభయి నాటి
        పేరిస్ నగరపు బజారు వీథులు
వీథుల డ్రెయినేజ్ తీరాలందు
పిల్లాజెల్లా తట్టాబుట్టా
వీపున వేసుక మహా మహా ప్రజ !
కడుపుల్లో కాళ్ళు కళ్ళల్లో నీళ్ళు
బయళ్ళు బయళ్ళు యెండిన బయళ్ళు
యెండి యెండి వ్యాపించిన పెద్ద పెద్ద బయళ్ళు !
బయళ్ళ నడుమని రయిలుదార్లపై
మొయిళ్ళు మాదిరి మహా మహాప్రజ !
పిండారీలో మరాఠి జనులో
పితృదేవతల పొలాల గనులో

అడవుల కొండల నదుల చీకటుల
మహా మహా మహా మహా మహాప్రజ !
కళ్ళల్లో నిప్పులు కురవాలి !
వొళ్ళు విరిచి పై పైకి లేవాలి !
ప్రళయ ప్రభంజనా వేగంతో
అమావాస్యా తమస్సాగర తరంగ పటలో ద్వేగంతో
విరుచుకుపడాలి ! – ఎందుకు ! ఎందుకు !
త్రిశంకు నరకం ! – పథారణాల త్రిశంకు నరకం
లుక్‌ఫర్ ఎనిథింగ్ నెయివ్ !
ఓన్లీ ఆన్‌ది గ్రేవ్ !

✤

క్షణికం - శాశ్వతం

చెప్పు నిజం చెప్పు తమ్ముడూ
నువ్వూ యోచించి చెప్పు అమ్మడూ !
క్షణికమేదో - శాశ్వతమేదో -
మెదడుతో వేసే నా ప్రశ్నో -
హృదయంతో చెప్పే నీ జవాబో -
ఏది క్షణికమో - ఏది శాశ్వతమో -
ఎలాగబ్బా చెప్పడం ?--
సృష్ట్యాది నుంచీ నేటీ రేపటీ
చరిత్రంతా కప్పడం !
మెదడుతో వేసే నా ప్రశ్నా
హృదయంతో చెప్పే నీ జవాబూ
సమకాలికములూ సాపేక్షములూ
అవుతాయే అనుకో !
అప్పుడు నే వేసే ఈ ప్రశ్నే
సృష్ట్యాది కాలంలో ఆ నరుడూ
రేపు మరెన్నడో ఉండే ఆ మానవుడూ
వేస్తారనుకో -

అప్పుడు నువు చెప్పే ఈ జవాబే
ఏనాడో ఆదికాలపు ఆ నరుడూ
మరివచ్చే కాలపు మానవుడూ
చెపుతారనుకో –
చెప్పు మన ప్రశ్నోత్తరాలు
క్షణికాలా – శాశ్వతాలా !
వసంతకాలపు కుసుమోద్గమం
గ్రీష్మ సమయపు ఊష్మ వంశీ నిశ్వసనం
శ్రావణ గగన కాదంబినీ మాలాంచలాల చలచ్చంచలా
శారదాభ్ర శకలాల నడుమ వొయ్యారంగా
సాగిపోయే చంద్రనౌకా
హేమంత తుషారావగుంఠనాన
ఘుమ ఘుమలాడే సేమంతీ
శైశిర నిశావసానాన కపోలపాళికపై
సోగగా సోకే మలయ సమీర రేఖా !
చెప్పు చెప్పు తమ్ముడూ ఇవన్నీ
శాశ్వతాలా క్షణికాలా
చెప్పు అమ్మడూ,
సూర్యుడు చంద్రుడు, గ్రహాలు, రాశులూ
చుక్కలూ, సూపర్ నోవాలు స్ఫులింగాలూ
ధ్రువుడూ సప్తర్షులూ శింశుమారమూ

వేధశాలలూ, విజ్ఞానమూ రాకెట్లూ
చెప్పు చెప్పు తమ్ముడూ ఇవన్నీ
శాశ్వతాలా క్షణికాలా
చెప్పు అమ్మడూ ?
ఆది ఋషుల యజ్ఞవేదుల కడ
అపౌరుషేయంగా ఆవిర్భవించిన ఋగ్వేదం
శోకమే శ్లోకమై సీతమ్మ శోకమ్మును
రామయ్య సుశ్లోకతనూ పాడిన ఆదికావ్యం
అన్నదమ్ముల దాయ భాగ విభాగంలో
అధర్మాన్ని అణచివేయడానికి జరిగి
కురుక్షేత్ర సమరగాథగా రూపొందిన పంచమవేదం
సూత్రాలూ సూక్తాలూ, సుభాషితాలూ, సువార్తలు
ప్రబంధాలు, భాష్యాలు, వ్యాఖ్యానాలూ
శతసహస్రాలు శ్రవ్య దృశ్యకావ్యాలూ
ధర్మబోధలు, కర్మగీతలు మర్మవేధలు
శృంగార గాథలు, బంగారు కథలు
సింగార బంగారాలకై చిరుత పులుల చెలగాటాలు
పాశవిక ప్రవృత్తి పెరిగి ఆటవిక మకుటానికై
మృగరాజుల పెనుగులాటలు
అల్పప్రాణుల చెరలాటలూ
చెప్పు చెప్పు అమ్మడూ ఇవన్నీ

క్షణికాలా శాశ్వతాలా
చెప్పు తమ్ముడూ !
సంకల్పాలు వికల్పాలు ఆశయాలు
భావాలు శబ్దాలు వాక్యాలు కావ్యాలు
శ్రుతులు స్మృతులు పురాణాలు
నీతులు, శాస్త్రాలు రాజ్యాంగాలు
కావా ఇవి ఏనాటికి ఆనాటికీ
ఆనాటికానాటికీ – నాటికీ నేటికీ
సంఘజీవిత ప్రతిబింబాలూ ?
నాటికీ నేటికి రేపటికీ
శంఖావర్తపు చంక్రమణంలో
శాశ్వతంగా పరిభ్రమించే
కాలయవనికను పడుగు పేకగా
కనకరత్నమయకాంతుల జల్లులతో
కర్బునాంధ తమస్సుల చిల్లులతో
క్షణక్షణ విభ్రమాలతో సాగిపోయే
అణుగోళికా పుంజాలు ? –
నీకూ నాకూ అందరికీ
ఆ క్షణానికేది ఆదర్శమై
ఆదరపాత్ర మౌతుందో అదే
శాశ్వతం అనిపిస్తుంది –

కానిది లేనిదిగా కనిపిస్తుంది –
కాని సూక్ష్మంగా ఆలోచిస్తే
భావం శాశ్వతం – భాష్యం క్షణికం
వాక్కు శాశ్వతం – వ్యంజన క్షణికం
శ్రుతి శాశ్వతం – స్మృతి క్షణికం
నియతి శాశ్వతం – నీతి క్షణికం
లయ శాశ్వతం – గీతం క్షణికం
ఆత్మ శాశ్వతం – రూపం క్షణికం ❖

డెలీరియం

అంతులేని అర్థంకాని వేసట లేని వెర్రి అన్వేషణ !
పవలు లేని వెలుగురాని కారుచీకటి రేయి !
మెరుపులేని వెరపు బయలులో ముసిలి పేద పురుముల
కరువు కేక !
యెడారు లెడార్లు ! కీకారణ్యాలు !
యెగుడు దిగుళ్ళు, మిట్ట పల్లాలు !
యిసక గోతులు, ముళ్ళపుంతలు – రాళ్ళ గుట్టలు
బందగోతులు – కొండచివరల కోసు అంచుల ఝరీపాతాలు !
బొగ్గు జారిన కుంపట్లో పాలగిన్నె కునికిపాట్లతో
పులికిపాట్లు ?
నిద్రాదేవి కౌగిలి మొదటి బిగింపు ప్రయత్నాల్లో
నడుంజారి, యేదోరాయి మీద కాలు జారి బేజారు చేసే
తొణుకుపాట్లు !
టికట్టు పారేసుకున్న ప్రయాణికుడి హృదయ గంద్రగోళం;
తీర్థంలో తప్పిపోయిన పిల్లాడి తల్లి గోల !
ధర్తీమాతలో గాలివానలో చెట్టును పట్టుకు వేళ్ళాడే
కే.సి.డే. కేక ! వర్షంలో నోరంతా తడిసి

నీరు జారుతున్నా తీరని ఉమాశశి దాహ ప్పిలుపు !
మంజిల్లో డెలీరియంలో బారువా గుండెల వెర్రి పరుగులు
కనిపిస్తాయి, వినిపిస్తాయి, జడిపిస్తాయి ! బాబూ
ఏడిపిస్తాయి కూడాను - ఒక్కోసారి ఉబ్బెత్తుగా ? !! ✤

చరమకాంక్ష !

వినిపిస్తూ వినిపిస్తూ వుందొక సముద్ర ఘోష
అతి చేరువగా కనిపిస్తూనే వుంది !
అడ్డం ! అనంతోన్నత సైకత శ్రేణులు అడ్డం !
ఏదో క్షణ క్షణ
అవ్యక్త అతర్కిత సమాగమ క్షణక్షణ
నిరీక్షణ !
ఆ వినీలాశావకాశాన ప్రగాఢాభ్రపటలాలించుకై నా
ప్రభాత ప్రభూతి కెప్పటికైనా
అవకాశ మీయవూ ! – ?
మహా విశ్వగర్భంలో ఒంటరిగా ఒంటిగా, ఒంటెగా
ప్రపంచగోళం అంచున కాళ్ళు
పార చాచుకుని బార చాచుకుని కంటి పైని
ఫాలభాగాన చేతితో
దూరదూర సీమాంతాల కేసి
పారచూచేది యెన్నాళ్ళు ?
ఊపిరాడని యీ తోలు ట్రైర్ల బండి పైని
యీ బరువులెందుకో – బాధ్యత లెందుకో !

ఓ చరమకాంక్షా – నాకు, పరమ సౌభాగ్యవతి పతికి
యీ దౌర్భాగ్యమెందుకు
ఆ తాడు కాస్త సాగి, నా వీపు పైని బరువు దిగజారితే
నేను యెగిరి నీ వొడిని వాలనే ?

అనుకోని ఆఖరి అతిథి !

పిలవకుండా వస్తావు, నువ్వు
నా కోసం తలుపు తడతావు !
అప్పుడు నేనుండను !
నిజానికి నువ్వు తలుపు తట్టడం
అచ్చంగా నేను కావలిసేనా ?
కాదు;
కాదు గనకనే
నేను అక్కర్లేదు గనకనే - పిలవకుండా వచ్చి,
నువ్వు నా కోసం తలుపు తడతావు !
అభ్యాగతుడిగా గాని, అతిథిగా గాని
నా యింటికి వచ్చి తలుపు తట్టిన మిత్రుడికి
ఆతిథ్యం యిస్తుంది - ఫలహార పానీయాలతో
మా ఆవిడ !
కూచోబెట్టి, దస్త్రం విప్పి, నా పాట వినిపిస్తాన్నేను !
అతిథే అలిసిపోవాలేమో కాని
అలసటుండదు నాకు - అలా యెంత సేపయినా
వినిపించడానికి !

పిలవకుండా వచ్చి, నువ్వు నా కోసం
తలుపు తడతావు !
నా పాట వినడానికి కాదు; పాడటానికి
అప్పుడు నేనుండను గద !
అది తల్చుకుంటేనే ఒక క్షణం
పని చేయడం మానేస్తుంది గుండె ?
ఆగిపోతుంది శ్వాస ! అలిసిపోతుంది ఆశ;
ఉక్కిరి బిక్కిరవుతుంది ఊహ !
మా ఆవిడ ఆతిథ్యం ఇయ్య లేనప్పుడు
నేను పాడటానికి లేనప్పుడు
నేను లేకుండా చూసి
నీ అంతటి అభ్యాగతుడు
మా యింటి తలుపు తడితే యెలాగ !
నేనుండనేమో అని తప్ప
నువ్వు తలుపు తడితే నాకు భయమా ?
నిన్న రాత్రి కలలో చూశా –
అనంతమైన ఆకాశం –
అందులోకి సూక్ష్మ ధూమ రేఖలా దూసుకుని
అంతర్లీన మయిపోయాను –
అంతులేని సాగరంలో నో

అగాధమయిన శూన్యంలోనో
అంతర్లీనమవుతున్నప్పుడు
అందుకో తగ్గ ఆధారమేదో దొరక్క
అరచిన ట్లొక్క కేకేశాను –
అలవాటయిన దేవుడి పేరది –
అందుకో తగ్గ ఆధారం; –
అంతర్థానం కాబొయ్యే నేను
అమాంతంగా శరీరం తొడుక్కుని
అర్ధరాత్రి నా పక్క మీదున్నాను.
శూన్యంలో మునిగిపోవడం
అంతులేని అంతరిక్షంలో పెరిగిపోవడం
అంటే అంత భయమా నాకు ?
నువ్వు చాలా మంది కోసం తలుపు తడుతున్నావు !
చాలా మందిని లేకుండా చేస్తున్నావు
అందుకే నీరాక తలుచుకుంటే
పని చెయ్యడం మానేస్తుంది గుండె
ఆగిపోతుంది శ్వాస, అలిసిపోతుంది ఆశ,
ఉక్కిరి బిక్కిరవుతుంది ఊహ !

★ ★ ★

చెయ్యవలసిన పనులున్నాయి
చెయ్యడానికి శక్తి కావాలి;

పేరు రావాలి, విలువ నిలవ చేయాలి !
నా గూటిలో రెక్కలురాని పక్కి బలగానికి
రెక్క లెదగాలి, ఎగిరిపోవాలి !
అప్పుడూ నేను అక్కర్లేక పోవడం .
బదిలీ అయిన ప్రభుత్వోద్యోగి లాగ
పని బకాయిలు పూర్తిచేసి సంతకాల బాకీలు తీర్చి,
ఫైళ్ళ దొంతరలు పేర్చి
చెయ్యవలసిన అప్పగింతలు చేసి
కూర్చునే కుర్చీ ఖాళీ చేస్తాను.
అప్పుడు నువ్వు నా తలుపు తడితే
నేనే అంతర్ధానమయి వుంటాను !
ఇంతా చేసి, నీ రాక జరిగేది నీ యిష్టానుసారమే; నాది కాదు;
ఎప్పటికైనా నేనే నీవైతే అప్పుడా రాక ఎవరి యిష్టానుసారం ? ✤

(ఇదొక్కటీ, ఇద్దరు ముగ్గురు సహచర సహోద్యోగి మిత్రుల్ని కోల్పోయాక 1960లో రాశాను)

ETIKI EDUREETA - Modern Poetry - 1940

by **Pusha (Rajani)**



ఆనాటి వచన కవితకు
కొత్తదారి చూపిన దీపస్తంభం.
వస్తువ్యాప్తికి, విన్యాసప్రతిభకీ
అభ్యుదయ భావపటిమకీ
పెద్దపీట వేసిన కవితా మంటపం
"పూషా" పేరుతో రజని 1940ల్లో
రచించిన వచన కవితలు

1940లో పూషా

[రజని]